కాళేశ్వరంపై సర్కార్‌ది కక్షపూరిత చర్య

- మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్
- కోడూర్ చౌరస్తాలో రైతులతో కలిసి ధర్నా


కోడూర్ చౌరస్తాలో చేపట్టిన ధర్నాలో మాట్లాడుతున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

మహబూబ్‌నగర్ రూరల్: కాళేశ్వరం ప్రపంచంలోనే ఒక అద్భుతమైన ప్రాజెక్టు అని, 20 లక్షల ఎకరాలకు నీరందించే ఈ ప్రాజెక్టు కాంగ్రెస్ ప్రభుత్వం కమిషన్లు, సీబీఐ అంటూ కక్షపూరితంగా వ్యవహరిస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తుందని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ చేస్తున్న కుట్రలు, రాష్ట్రంలో రైతులకు యూరియా ఇవ్వకుండా ఇబ్బందుల పాలు చేయడాన్ని నిరసిస్తూ బుధవారం మండలపరిధిలోని కోడూర్ చౌరస్తాలో చేపట్టిన ధర్నాలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కార్ ఏర్పడి 22 నెలలు అవుతుందని, నాటి నుంచి పలు కమిషన్లు, విచారణలంటూ అనవసరమైన రాద్ధాంతం చేస్తుందని మండిపడ్డారు. ప్రతిపక్ష బీఆర్‌ఎస్‌ను కేసీఆర్‌ను బదనాం చేసే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. యూరియా కావాలని రైతులు ఆందోళనలు చేస్తున్నారని, ఎన్ని ఎకరాలు ఉన్నా రైతుకు ఒకటి, రెండు సంచుల యూరియా మాత్రమే ఇస్తున్నారని, రెండు, మూడు, ఐదు ఎకరాలు పంట వేసిన రైతుల పరిస్థితి ఏంటో ఆలోచన చేయాలని అన్నారు. తిండి తినకుండా, రాత్రిళ్లు వర్షంలో నిద్ర లేకుండా యూరియా విక్రయకేంద్రాల వద్ద రైతులు ఉన్న వారికీ యూరియా అందటం లేదని అన్నారు. ఇసుక, యూరియా కలుపుకొని చల్లాలి అని వ్యవసాయ మంత్రి అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని, పంటలు యెట్లా పండుతున్నాయి అనేది కూడా మంత్రులకు అవగాహన లేదని విమర్శించారు. ముఖ్యమంత్రి సొంత జిల్లాలో రైతుల పరిస్థితి దారుణంగా ఉందని, ఆయన పర్యటన సమయంలో కూడా రైతులు యూరియా కోసం వరుసల్లో నిలబడిన పరిస్థితి జిల్లాలో ఉందని అన్నారు. కాంగ్రెస్ పాలనలో యూరియా కోసం చెప్పులు లైన్‌లో పెడుతున్నారని, లైన్‌లలో ఉన్న వారు ఆకలితో సొమ్మసిల్లి పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు పడుతున్న ఇబ్బందులపై ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే రాజకీయం చేస్తున్నారని అంటున్నారని, క్షేత్ర స్థాయిలో మంత్రులు, అధికారులు పర్యటిస్తే వాస్తవం తెలుస్తుందని అన్నారు. కలెక్టర్, వ్యవసాయ అధికారులు క్షేత్ర స్థాయిలో పరిస్థితులు తెలుసుకొని రైతులకు అవసరమైన ఎరువులు అందించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. రైతులు నష్టపోతే జిల్లా నుంచే ఉద్యమం ప్రారంభమవుతుందని హెచ్చరించారు. ధర్నాలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ బి.రాజేశ్వర్‌గౌడ్, మాజీ ఎంపీపీ సుధాశ్రీ, పీఏసీఎస్ చైర్మన్ రాజేశ్వర్‌రెడ్డి, మాజీ మార్కెట్ చైర్మన్ ఆంజనేయులు, మాజీ సర్పంచ్‌లు బి.శ్రీకాంత్‌గౌడ్, ఊశన్న, రామచంద్రయ్య, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మల్లు దేవేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి వై.శ్రీనివాసులు, నాయకు లు రవీందర్‌రెడ్డి, రాఘవేందర్‌గౌడ్, అల్లావుద్దీన్, శే ఖర్, వెంకటయ్య, కృష్ణయ్య, మస్తాన్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

వినాయక విగ్రహం చోరీ



మిడ్జిల్: మండల కేంద్రంలో కుర్మయాదవ సంఘం సమీపంలో చిన్నారులు ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాన్ని మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. బుధవారం గమనించిన చిన్నారులు కాలనీ పెద్దలకు చెప్పడంతో వారు, గ్రామ పెద్దలకు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. అదే కాలనీకి చెందిన కొందరు యువకులు మద్యం మైకంలో విగ్రహాన్ని చోరీ చేసినట్లు తెలిసింది. ఈ విషయంపై పోలీసులు విచారణ చేస్తున్నారు.

పీయూ విద్యార్థికి డాక్టరేట్



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీ బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగంలో రీసెర్చ్ స్కాలర్‌గా పనిచేస్తున్న ఎం.సంధ్యారాణికి పీయూ అధికారులు డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. ఈ మేరకు పీయూ అధ్యాపకులు అనురాధారెడ్డి, బోర్డు ఆఫ్ స్టడీస్ డైరెక్టర్ శ్రీరాములు ఆధ్వర్యంలో 'ఐటీ కంపెనీ ఉద్యోగుల నిలుపుదలలో ప్రేరణ యొక్క ప్రభావం' అనే అంశంపై గత కొన్ని సంవత్సరాలుగా చేసిన పరిశోధనలకు ఆమెకు డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా వీసీ శ్రీనివాస్ ఆమెను అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పరిశోధనల ద్వారా అనేక సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ రమేష్‌బాబు, కంట్రోలర్ ప్ర వీణ, శాంతిప్రియ ఆమెను అభినందించారు.

రోడ్డుపై నాట్లు వేసి నిరసన



దేవరకద్ర రూరల్: వెంకటగిరి–వెంకంపల్లి మధ్యలో ఉన్న ప్రధాన రోడ్డును బాగు చేసి, పనులలో నిర్లక్ష్యం వహిస్తున్న కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని బుధవారం కౌకుంట్ల మండలంలోని ప్రజలు రోడ్డుపై నాట్లు వేసి నిరసన తెలిపారు. 18 నెలల క్రితం వెంకటగిరి దగ్గర అండర్ బ్రిడ్జి నిర్మాణానికి అధికారులు ప్రధాన రోడ్డును మూసివేసి తాత్కాలిక మట్టిరోడ్డు మీదుగా రాకపోకలను మళ్లించారన్నారు. కాంట్రాక్టర్ పనులు నత్తనడకన కొనసాగిస్తుండటంతో ప్రస్తుతం ఉన్న మట్టి రోడ్డు మొత్తం గుంతలమయంగా మారి 30 గ్రామాల ప్రజల రాకపోకలకు తీవ్ర ఇబ్బంది ఏర్పడిందన్నారు. ఈ విషయంపై అధికారులకు, ప్రజాప్రతినిధులకు ఎన్ని సార్లు ఫిర్యాదు చేసినా ఫలితం లేదన్నారు. ఈ తెలుసుకున్న ఎంపీడీఓ శివప్రసాద్, తహసీల్దార్ సుందర్‌రాజ్ అక్కడికి చేరుకొని రోడ్డుకు మరమ్మతు చేయిస్తామని గ్రామస్తులకు హామీ ఇవ్వడంతో శాంతించారు. కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

పత్తి రైతులకు ఎక్స్‌గ్రేషియా అందించాలి

చిన్నచింతకుంట: పత్తి పంటను సాగు చేసి నష్టపోయి ఆత్మహత్యలు చేసుకున్న రైతు కుటుంబాలకు ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా అందించాలని అఖిల భారత ఐక్య రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి రాంచందర్ డిమాండ్ చేశారు. బుధవారం రైతు కు టుంబాలకు ఎక్స్‌గ్రేషియా అందించాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత ఐక్య రైతు సంఘం ఆధ్వర్యంలో చిన్నచింతకుంట మండల కేంద్రంలో తహసీల్దార్ ఎల్లయ్యకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు కోళ్ల వెంకటన్న, దేవదానం, నర్సింహులు, అడివన్న, పలువురు ఉన్నారు.

జనరల్ ఆస్పత్రిలో వైద్యుడి నగదు అపహరణ

పాలమూరు: జిల్లా జనరల్ ఆస్పత్రిలో పని చేసే వైద్యుడి డబ్బును గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారు. వివరాల్లోకి వెళితే.. పట్టణంలోని జిల్లా జనరల్ ఆస్పత్రిలో పని చేసే చిన్న పిల్లల వైద్యుడు ఖమీల్ అహ్మద్ బుధవారం ఉదయం ఎస్‌ఎన్‌సీయూలో విధులు నిర్వహిస్తున్న సమయంలో తన పర్సు, దాంట్లో రూ.15వేల నగదుతో టేబుల్ దగ్గర పెట్టాడు. ఓ కేసు చూడటానికి రౌండ్స్‌కు వెళ్లిన సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు పర్సును ఎత్తుకెళ్లారు. వైద్యుడు టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

దరఖాస్తుల ఆహ్వానం

కందనూలు: నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని శ్రీపురం రోడ్డులో ఉన్న ఆర్ట్స్ డిగ్రీ కళాశాల ఆంగ్లం బోధించుటకు అతిథి అధ్యాపకులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ గీతాంజలి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గలవారు ఈ నెల 6వ తేదీ మధ్యాహ్నం 12 గంటల వరకు కళాశాలలో దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. సెట్, నెట్ కలిగిన వారికి మొదటి ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు.

అభివృద్ధే మా లక్ష్యం


కొల్లూర్‌లో బీటీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

నవాబుపేట: అభివృద్ధే లక్ష్యంగా ముందుకెళ్తూ అధికారంలోకి వచ్చిన కొద్ది రోజుల్లోనే గ్రామాల్లో పనులు పరుగులు పెట్టించామని జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని యన్మన్‌గండ్ల, కొల్లూర్ గ్రామాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లో కనీస సౌకర్యాలు లేకుండా అభివృద్ధి జాడ కరువైందని అలాంటి వాటిని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా కొల్లూర్ నుంచి బట్టోనిపల్లితండా బీటీకి రూ.2 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. అనంతరం ఆయా గ్రామాలకు చెందిన కొత్త రేషన్‌కార్డు లబ్ధిదారులకు ప్రొసిడింగ్స్ అందజేశారు. కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ లింగం, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి దుశ్యంత్‌రెడ్డి, మైసమ్మ ఆలయ చైర్మన్ జగన్, మండల అధ్యక్షుడు రాంచంద్రయ్య, భూపాల్‌రెడ్డి, వెంకటేష్‌గౌడ్, వాసుయాదవ్, యూత్ అధ్యక్షుడు నీలకంఠ, మార్కెట్ వైస్ చైర్మన్ తులసీరాంనాయక్ ఉన్నారు.

ఆరోగ్య తెలంగాణగా అభివృద్ధి చేస్తాం



స్టేషన్ మహబూబ్‌నగర్: రాష్ట్రాన్ని ఆరోగ్య తెలంగాణగా అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మహబూబ్‌నగర్ అర్బన్ మండలానికి చెందిన 79 మంది లబ్ధిదారులకు రూ.38లక్షల విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను బుధవారం ఎ మ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వం ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేసినా సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క క్రమశిక్షణతో గాడిలో పెట్టేందుకు కృషి చేస్తూ సంక్షేమ పథకాలు ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ముడా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్, కాంగ్రెస్ పా ర్టీ సీ నియర్ నాయకులు వినోద్‌కుమార్, సిరాజ్ ఖా ద్రీ, రాములుయాదవ్, ఏర్పుల నాగరాజు, మాజీ కౌ న్సిలర్లు ఖాజాపాష, అంజద్, చిన్న, మోసీన్, రఘు, కిషన్‌నాయక్, అక్బర్, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

❑ **క్షేత్రస్థాయిలో పనిచేయాలి**

కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం కార్యకర్తలు క్షేత్రస్థాయిలో పనిచేయాలని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. డీసీసీ కార్యదర్శి టంకర కృష్ణయ్య యాదవ్ ఆధ్వర్యంలో టంకర గ్రామానికి చెందిన వివిధ పార్టీలకు చెందిన 50 మంది కార్యకర్తలు ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఎమ్మెల్యే వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

అక్షరాస్యత శాతాన్ని పెంచాలి


కస్తూర్బాలో విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈఓ ప్రవీణ్‌కుమార్

అడ్డాకుల: జిల్లాలో అక్షరాస్యత శాతాన్ని పెంచేందుకు అందరు కృషి చేయాలని జిల్లా విద్యాధికారి ప్రవీణ్‌కుమార్ సూచించారు. మూసాపేట మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం వీఓలకు జరిగిన ఉల్లాస్ శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో 14 ఏళ్ల యువతీ, యువకులు చదువుకోకుంటే ఓపెన్ స్కూల్‌లో పదో తరగతి చదివే అవకాశం ఉందన్నారు. పదో తరగతి చదివి ఇంటర్ చదవని వారికి కూడా ఇంటర్ చదివే అవకాశం ఉందని, అటువంటి వారిని వీఓలు ప్రోత్సహించాలని సూచించారు. అనంతరం పాఠశాలలో మధ్యాహ్న భోజనం డీఈఓ పరిశీలించారు. అంతకు ముందు ఉదయం కస్తూర్బా విద్యాలయాన్ని ఆయన సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడి వారి చదువులపై ఆరా తీశారు. కార్యక్రమంలో ఎంఈఓ రాజేశ్వర్‌రెడ్డి, ఎస్‌ఓ పావని తదితరులు ఉన్నారు.

ప్రతి ఒక్కరిని అక్షరాస్యులుగా మార్చాలి

దేవరకద్ర: నవ భారత్ సాక్షరత్ కార్యక్రమం ద్వారా ప్రతి ఒక్కరిని అక్షరాస్యులుగా మార్చాలని ఎంపీడీఓ శ్రీనివాసరావు కోరారు. దేవరకద్ర జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో ఉల్లాస్ శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. దేవరకద్ర మండలంలో దాదాపు 3400 మంది వయోజనులను గుర్తించినట్లు తెలిపారు. పాఠశాల కళాశాల విద్యార్థులు, స్వయం సహాయక సంఘాలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, స్వచ్ఛంద కార్యకర్తలు ముందుకొచ్చి ఉల్లాస్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో ఎంఈఓ బలరాం, హెచ్‌ఎం నాగేంద్రమ్మ, ఏపీఎం సునీత, ఆర్‌పీలు పవన్‌కుమార్, రాఘవేందర్ పాల్గొన్నారు.

శిక్షణ సద్వినియోగం చేసుకోవాలి

జడ్చర్ల టౌన్: గ్రామాల్లోని వయోజనులను అక్షరాస్యులుగా మార్చేందుకు ఇస్తున్న శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ మంజులాదేవి పిలుపునిచ్చారు. బుధవారం మున్సిపాలిటీ పరిధిలోని జడ్చర్ల జెడ్పీహైస్కూల్‌లో ఉపాధ్యాయులు, వీఓఏలకు నిర్వహించిన ఉల్లాస్ శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. గ్రామంలోని ప్రతి ఒక్కరిని అక్షరాస్యులుగా మార్చటం లక్ష్యంగా ఉల్లాస్ కార్యక్రమం అమలవుతుందన్నారు. ఇందుకోసం వచ్చిన మెటీరియల్‌ను తీసుకెళ్లాలని సూచించారు. శిక్షణ కార్యక్రమాన్ని అధికారులు శ్రీనివాస్‌రెడ్డి, మాధవిలు సందర్శించారు. ఆర్‌పీలు శేషసేనారెడ్డి, శివరాములు శిక్షణ ఇచ్చారు.

నేడు ఫైర్‌స్టేషన్ నూతన భవనం ప్రారంభం



జడ్చర్ల టౌన్: 44వ నంబరు జాతీయ రహదారిపై కావేరమ్మపేట వద్ద పోలేపల్లి ఫార్మా సెజ్‌లోని హెటిరో ల్యాబ్స్ నిర్మించిన ఫైర్‌స్టేషన్ నూతన భవనాన్ని గురువారం మంత్రి వాకిటి శ్రీహరి ప్రారంభించనున్నారు. రూ.38లక్షలతో ఫైర్‌స్టేషన్‌కు నూతన భవనం నిర్మించారు. మంత్రి శ్రీహరితో పాటు ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి హాజరుకానున్నారు. మున్సిపాలిటీ పరిధిలోని జౌకినగర్‌లో ఏర్పాటు చేసిన సె ట్విన్ శిక్షణ కేంద్రాన్ని సైతం మంత్రి ప్రారంభించనున్నారు.

సమస్యల పరిష్కారానికి శ్రీకారం


మర్లులో సీసీ రోడ్డు వేయిస్తున్న సోమిరెడ్డి రమేష్‌రెడ్డి

పాలమూరు: ప్రజలకు సేవ చేయడంతో పాటు అభివృద్ధి పనులు చేయడానికి కాంగ్రెస్ యువనాయకుడు సొంత డబ్బులు ఖర్చు చేసి వార్డులో పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నాడు. జిల్లా కేంద్రంలో మర్లు 23వార్డుకు చెందిన కాంగ్రెస్ పార్టీ యువనాయకుడు సోమిరెడ్డి రమేష్‌రెడ్డి వార్డులో పలు రకాల పనులు చేయిస్తున్నాడు. వాహనాల రాకపోకలకు సరైన రోడ్డుమార్గం, డ్రెయినేజీ కోసం సిమెంట్ పైపుల ఏర్పాటు చేయించారు. గుంతల రోడ్లపై మట్టితో తాత్కాలిక మరమ్మతు, కాలనీల్లో విద్యుత్ దీపాలు ఏర్పాటు వంటి పనులు చేయిస్తున్నాడు.

ఇండస్ట్రీయల్ కారిడార్ ఏర్పాటు చేయాలి

- ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి


సీఎంకు చుక్కల చిత్రాన్ని అందజేస్తున్న గిన్నె వెంకటేశ్వర్లు

అడ్డాకుల: దేవరకద్ర నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో కలిపి సుమారు 68 కిలోమీటర్ల మేర జాతీయ రహదారి విస్తరించి ఉన్నందున హైవే వెంట ఇండస్ట్రీయల్ కారిడార్ ఏర్పాటు చేయించే విధంగా చూడాలని దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. గంటలో ఎయిర్‌పోర్టుకు చేరుకునే అవకాశం ఉన్నందున నాలుగు మండలాల్లో ఇండస్ట్రీయల్ కారిడార్ ఏర్పాటు చేయించాలన్నా రు. బ్రహ్మోస్ మిసైల్ తయారీ యూనిట్ దేవరకద్ర కు తీసుకొచ్చేందుకు ప్రయత్నం చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. దేవరకద్ర నియోజకవర్గానికి అడిగినవన్ని ఇస్తున్న సీఎంకు కృతజ్ఞతలు తెలుపుతూ వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని సీట్లల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించి సీఎం మాటను నిలబెడతామని జీఎంఆర్ పేర్కొన్నారు.

సీఎం పర్యటన సాగిందిలా..

❑ ఉదయం 11 గంటలకు బేగంపేట నుంచి హెలీకాప్టర్‌లో బయలు దేరాల్సిన సీఎం రేవంత్‌రెడ్డి మధ్యాహ్నం 12.26 గంటలకు బయలు దేరారు.

❑ 1.02 గంటలకు వేముల ఎస్‌జీడీ ఫార్మా వద్ద హెలీకాప్టర్ ల్యాండ్ అయింది.

❑ పరిశ్రమ రెండో యూనిట్‌ను సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించి 1.20 గంటలకు స్టేజీ వద్దకు చేరారు.

❑ 25 నిమిషాల పాటు సీఎం ప్రసంగించారు.

❑ 2.12గంటలకు సీఎం సభా వేదిక నుంచి వెళ్లిపోయారు.

❑ ఇక్కడి నుంచి హెలీకాప్టర్‌లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు బయలు దేరారు.

చుక్కల చిత్రకారుడికి సీఎం అభినందన

మూసాపేట మండల కేంద్రానికి చెందిన టీటీడీ శిల్ప కళాశాల అధ్యాపకుడు, దేశంలోనే మొదటి బాల్ పాయింట్ పెన్ చుక్కల చిత్రకారుడిగా గుర్తింపు పొందిన గిన్నె వెంకటేశ్వర్లు సాగర్‌ను సీఎం రేవంత్‌రెడ్డి అభినందించారు. సీఎంను దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి సహకారంతో వెంకటేశ్వర్లు కలిశారు. బాల్ పాయింట్ పెన్ చుక్కలతో వేసిన రేవంత్‌రెడ్డి చిత్రపటాన్ని సీఎంకు అందజేశారు. సీఎం ఆయనను ప్రత్యేకంగా అభినందించారు.

నిరీక్షించినా.. యూరియా ఏదయ్యా?


నవాబుపేటలో భారీ క్యూలైన్లు

- కొనసాగిన భారీ లైన్లు..
- రేయింబవళ్లు వేచి ఉన్న అరకొరగా సరఫరా
- నిరాశతో వెనుదిరిగిన అన్నదాతలు

నవాబుపేట: అన్ని ఊర్లు కోడి కూతతో మేలకుంటే మండల కేంద్రం మాత్రం రైతుల కేకలతో మేలుకుంటోంది. నిత్యం యూరియా కోసం తెల్లారకముందే లైన్లు కట్టి యూరియాకు నిరీక్షిస్తున్నారు. ఇటీవల రోజూ ఈ సంఘటన చోటు చేసుకుంటోంది. దీంతో ఊసూరు మనిపించి కేవలం రెండు మూడు గంటలలోనే యూరియా ఖాళీ కావటంతో అన్నదాతలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తు వెనుదిరిగారు. మండల కేంద్రంలో బుధవారం తెల్లవారుజామునుంచే రైతులు క్యూ కట్టడం మొదలుపెట్టారు. దీంతో సహకార సంఘం కార్యాలయం నుంచి పావు కిలోమీటర్ పైగా క్యూలైన్ ప్రధాన రోడ్డు వరకు విస్తరించింది. కాగా యూరియా పంపిణీ ప్రారంభమైన మూడు గంటల్లోనే మొత్తం ఖాళీ అయ్యింది. దీంతో గంటల తరబడి వేచి ఉన్న అన్నదాతలు నిరాశతో నిట్టూరుస్తూ వెనుదిరగాల్సి వచ్చింది. వేయికి పైగా రైతులు రాగా కేవలం వందలలో యూరియా బస్తాలు రావటంతో అవి కేవలం కొందరికే పరిమితమయ్యాయి. బుధవారం 6 వందల బస్తాల యూరియా మాత్రమే రావటంతో ఇబ్బంది ఏర్పడింది.

❑ **ఒక్కటి ఇస్తామంటే ఒప్పుకోని రైతులు**

యూరియా కొరతతో ఒక్కబస్తా మాత్రమే ఇస్తామని అధికారులు చెప్పటంతో అన్నదాతలు మొండికేశారు. కొన్ని రోజులుగా రెండు బస్తాలు ఇస్తూ, తాజాగా ఒక్కటి ఇస్తామంటే ఊరుకునేది లేదని హెచ్చరించారు. దీంతో తలొగ్గిన అధికారులు చేసేది లేక ఒక్క రైతుకు రెండు బస్తాలు ఇవ్వాల్సి వచ్చింది.

❑ **పోలింగ్ తీరును తలపించేలా..**

పోలింగ్‌కు బారికేడ్లు ఏర్పాటు చేసినట్లు యూరియాకు సైతం రైతులు పోటెత్తడంతో పోలీసులు బారికేడ్లు ఏర్పాటు చేసి యూరియాను సరఫరా చేయించారు.

“ ఒక్కబస్తా ఇస్తామంటే ఒప్పకోం..



మొన్నటి వరకు రెండు బస్తాలు ఇచ్చి తీరా ఈ రోజు ఒక్కటి ఇస్తామంటే ఊరుకునేది లేదని హెచ్చరించాం. రైతులకు కావాల్సిన యూరియా ఇవ్వాలని కోరితే ఇచ్చే దాంట్లో కోత విధిస్తే ఎలా. ఒక్క సంచి యూరియా తీసుకెళ్లి ఏం చేసుకోవాలంటూ నిలదీ శాం. రైతులకు యూరియా కావాల్సినంత సరఫరా చేయాలి. లేకుంటే రోజు ఇలాగే లైన్లు ఉంటాయి.

– చెన్నయ్య, చెన్నరెడ్డిపల్లి, నవాబుపేట

ఇద్దరు కేంద్ర మంత్రులుండి ఏం లాభం?

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): తెలంగాణ నుంచి బీజేపీకి చెందిన ఇద్దరు కేంద్ర మంత్రులు ఉండి కూడా రాష్ట్రంలో రైతులు యూరియా కోసం అష్ట కష్టాలు పడుతున్నారని బీసీ జేఏసీ రాష్ట్ర నాయకుడు మైత్రి యాదయ్య, తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి జిల్లా అధ్యక్షుడు శివన్న బుధవారం ఒక ప్రకటనలో నిలదీశారు. ఇద్దరు కేంద్ర మంత్రులు, 8 మంది ఎంపీలు, అందులో బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు అరుణ ఉండి జిల్లాలో యూరియా కోసం రైతులు రాత్రింబగలు యూరియా కేంద్రాల వద్ద బడిగాపులు కాస్తున్నారని మండిపడ్డారు. అధికారిక లెక్కల ప్రకారం 28 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా అవసరముంటే కేంద్ర ప్రభుత్వం కేవలం వేల టన్నుల్లో యూరియా రాష్ట్రానికి పంపిందని ఆరోపించారు. కేంద్ర మంత్రులు, ఎంపీలు రైతుల కష్టాలపై మాట్లాడకుండా రాజకీయాలు మాట్లాడడం సిగ్గు చేటని పేర్కొన్నారు. బీజేపీ మంత్రులు, ఎంపీలు బాధ్యత తీసుకుని తెలంగాణకు యూరియా తెప్పించాలని డిమాండ్ చేశారు.

పండుగలు ఐకమత్యానికి ప్రతీకలు


నవాబుపేటలో గణనాథుడికి పూజలు చేస్తున్న భక్తులు


మిడ్జిల్‌లో మల్లేష్‌కు లడ్డు అందజేస్తున్న నిర్వాహకులు


చిన్నచింతకుంటలో పూజలు చేస్తున్న దంపతులు


నవాబుపేట శివాలయంలో అన్నదాన కార్యక్రమం

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్)/మిడ్జిల్/నవాబ్‌పేట/చిన్నచింతకుంట: జిల్లా కేంద్రంలో ప్రతిష్ఠించిన పలు గణేష్ మండపాలను సందర్శించి గణనాథులకు బుధవారం మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతి ఒక్కరు సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. పండుగలు ఐకమత్యానికి ప్రతీకలని జిల్లా కాంగ్రెస్ నాయకులు ప్రవీణ్ అన్నారు. ఘూన్సీనగర్‌లో గణేషుడికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం ప్రారంభించారు.

లడ్డు రూ.1.32లక్షలు..

❑ మిడ్జిల్ మండల కేంద్రంలో వ్యాపార సంఘం, శివాజీ యూత్, కుర్మయాదవ సంఘం ఆధ్వర్యంలో వినాయక నిమజ్జనం సందర్భంగా లడ్డు వేలంలో రూ.1.32లక్షలకు ఎడ్ల మల్లేష్ దక్కించుకున్నారు. అనంతరం మహిళల కోలాటం, యువత డ్యాన్స్‌లతో ఉత్సాహంగా నిమజ్జనానికి తరలించారు.

అన్నదాన కార్యక్రమం

❑ నవాబుపేటలో శివాలయం, శ్రీరాంనగర్‌కాలనీ, నీలకంఠ దేవాలయంలో అన్నదాన కా ర్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింహచారి, మాజీ సర్పంచ్‌లు గోపాల్‌గౌడ్, చంద్రశేఖర్, సుధాకర్‌చారి, నర్సింహులు, శివకుమార్, చంద్రశేఖర్, రాజేష్, శ్రీధర్, నరేష్, శ్రీనువాస్, రాహుల్, శేఖర్ ఉన్నారు.

❑ చిన్నచింతకుంట మండల కేంద్రంలో వినాయకుడికి నూతన దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు.